సాక్షి
అనకాపల్లి
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023





వీనులవిందుగా గాత్ర కచేరీ

విశాఖ: వీఎండీఏ నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటకోత్సవాల్లో బుధవారం శారదా సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ అలరించింది.



ఉపాధి కల్పన

ఎంఎస్ఎంఈ పార్కులతో ఉపాధి లభిస్తుందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 8లో



స్టేడియం అభివృద్ధికి ప్రణాళిక

విశాఖ: మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు.

రారా.. కృష్ణయ్యా..!

చేత వెన్నముద్ద.. చెంగల్వ పూదండ.. బంగారు మొలతాడు పట్టుదట్టి.. రారా కృష్ణయ్యా! నెమలి పింఛం ధరించి.. చిరునగవు మోముతో.. సిరిమువ్వ గజ్జెలు ఘల్లుఘల్లుమన రావయ్యా కృష్ణయ్యా! మురళీ రవళితో వీనుల విందుగా.. మా కనుల పంటగా పరవశింపజేయగా.. దర్శనమీయవా కృష్ణయ్యా.. అంటూ భక్తులు వేడుకున్నారు. కనులు కాయలు కాచేలా ఎదురుచూశారు. కన్నయ్య రూపంతో తమ చిన్నారులను తయారు చేసి మురిసిపోయారు. వేణువు చేతబట్టిన వారి ముద్దులొలికే రూపాన్ని చూసి మైమరచిపోయారు. బుధవారం పలుచోట్ల కృష్ణాష్టమి పర్వదినాన్ని నిర్వహించారు. ఉట్టి సంబరాలు జరిపారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పిల్లలు కృష్ణుడు, గోపిక రూపాల్లో అలరించారు. దేవరాపల్లిలో యాదవ సంఘం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల గురువారం కూడా కృష్ణాష్టమి జరుపుతారు.

-సాక్షి న్యూస్ నెట్‌వర్క్



దేవరాపల్లిలో ఉట్టి మహోత్సవాన్ని తిలకిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లిలో ఒక ప్రైవేట్ పాఠశాలలో ఆకట్టుకున్న శ్రీకృష్ణ, గోపిక వేషధారు లు



కె.కోటపాడులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలో ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు

న్యూస్‌రీల్

డీఆర్వోగా దయానిధి బాధ్యతల స్వీకరణ



తుమ్మపాల: జిల్లా రెవెన్యూ అధికారిగా బి.దయానిధి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కమిషనర్ కార్యాలయం వీఆర్‌లో ఉన్న ఆయన, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి డీఆర్వోగా వ్యవహరిస్తున్న డి.అనిత విజయనగరం డీఆర్వోగా బదిలీ అయ్యారు.

రేపు నాతవరంలో 'స్పందన'

స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో ఈ నెల 8న నాతవరంలో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇకపై మండల స్థాయిలో ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నాతవరం మండల కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు.

కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ గోరాపుర్–అరకు–సిమిలిగుడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్ పనుల నిమిత్తం కేకే లైన్‌లో ప్రయాణించే కిరండూల్ పాసింజర్ స్పెషల్ రైలును ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో ప్రతీరోజు బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు, కిరండూల్‌లో ప్రతీ రోజు బయల్దేరే కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు రద్దయినట్లు పేర్కొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఆర్కే హాస్పిటల్, క్వీన్స్ ఎన్నారై, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఎంజీఎం క్యాన్సర్ హాస్పిటల్, అపోలో ఫార్మసీ హీరో మోటో కార్ప్, హెటిరో డ్రగ్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, టీసీఎల్–సీఎల్‌వోటీ, ఇండస్, కేర్ హాస్పిటల్, సెవెన్ హిల్స్ హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 665 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బిల్లింగ్, కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ రిప్రెజెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, కార్పెంటర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, ఓటీ స్క్రబ్ నర్స్, ఇన్‌చార్జ్ నర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 20–40 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. జీతం నెలకు రూ.12,500 నుంచి రూ.32,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

నూకాంబిక నూతన తేజం

- నేడు ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం
- వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పూర్తి
- రూ.11 కోట్లతో ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ పునర్నిర్మాణం

సాక్షి, అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం ప్రారంభమవుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. నిర్మాణ పనులు చకచకా చేపట్టే విధంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పనులు పూర్తి చేయనున్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు ఆలయ అధికారులు, పురోహితులు పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి మొత్తం రూ.11 కోట్ల వ్యయం అవుతున్నట్లు అంచనా వేశారు. వీటిలో తొలివిడతగా రూ.3.5 కోట్లతో నూతన గర్భాలయం, అంతరాలయం, అనువెట్టి మండపం, మలివిడతలో రూ.5 కోట్లతో ప్రాకార మండపం పనులు చేపట్టనున్నారు. వీటిలో టీటీడీ నుంచి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం రూ.8.5 కోట్లతో పనులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయి ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.11 కోట్లు ఖర్చవుతుంది. అన్నదాన సత్రంతోపాటు కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నారు.

రాతి కట్టుతో గర్భాలయం

ప్రస్తుతం గర్భాలయం 14 అడుగుల వెడల్పు, 14 అడుగుల పొడవు ఉంది. 17.11 అడుగుల వెడల్పు, పొడవు ఉండేటట్టు పునర్నిర్మిస్తారు. 12, 14 వెడల్పు, పొడవుగల అంతరాలయాన్ని 17.11 అడుగుల పొడవు, 15.3 వెడల్పుతో నిర్మిస్తారు. 98 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ఉన్న ప్రాకార మండపాన్ని రాజగోపురంతో కలిపి 175 అడుగుల పొడవు, 93 అడుగుల వెడల్పుతో నిర్మిస్తారు. రాతికట్టుతో గర్భాలయ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితే నూకాంబిక ఆలయం కొత్త కళ సంతరించుకుంటుంది.



నూకాంబిక ఆలయం

ఆగమ శాస్త్ర ప్రకారమే...

ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయంలో శిల్పాల నిర్మాణం ఉంటుంది. ప్రస్తుత ఆలయాన్ని క్రమేపీ తొలగిస్తూ శాస్త్ర నియమం మేరకు నూతన ఆలయాన్ని నిర్మిస్తారు. దేవాలయాన్ని మూడు భాగాలుగా విభజించి పనులు చేపడతారు. టీటీడీ చైర్మన్ హోదాలో వై.వి.సుబ్బారెడ్డి ఆలయానికి వచ్చినప్పుడు ఆలయ అభివృద్ధికి సహకారం కోరిన వెంటనే ఆయన టీటీడీ నుంచి రూ.1.5 కోట్లు మంజూరు చేశారు.

బాలాలయంలో దర్శనాలు



800 ఏళ్ల చరిత్ర గల అమ్మవారి ఆలయాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పునర్నిర్మిస్తున్నాం. గురువారం ఉదయం 11.20 గంటలకు నూకాంబిక అమ్మవారి ఆలయంలో వైదికపరమైన ప్రక్రియను వైదికులు ఏకాంతంగా జరిపిస్తారు. అమ్మవారి మూలవిరాట్ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తాం. దేవస్థానం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో అమ్మవారిని దర్శించవచ్చు.

– బండారు ప్రసాద్, ఆలయ ఈవో

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్: గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణ పనులను గురువారం ఉదయం 11.20 గంటలకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ చెప్పారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం జరిగే సమయంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. దేవస్థాన కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో అమ్మవారి విగ్రహాన్ని తాత్కాలికంగా ప్రతిష్ఠిస్తామన్నారు. పనులు పూర్తయ్యే వరకు అమ్మవారి మూలవిరాట్ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తామని, భక్తులు బాలాలయంలో అమ్మవారిని దర్శించవచ్చని చెప్పారు. ప్రతీ రోజు అమ్మవారి మూలవిరాట్‌కు నిత్యకైంకర్యాలు, భోగాలు యథావిధిగా ఏకాంతంగా జరుగుతాయన్నారు. బాలాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి రూ.100ల టికెట్ తీసుకున్న భక్తులు స్వయంగా దేవస్థానం వారు అందించే ఆవుపాలతో అభిషేకం చేసుకోవచ్చునన్నారు. ఉదయం 6 నుంచి 11.30 గంటల వరకు ఈ అవకాశం ఉంటుందని, మధ్యాహ్నం 12 గంటల తరువాత కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి బాలాలయంలో లక్ష్మీహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కంటపల్లి శోభారాణి వెంకటరావు, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, పాము అనురాధ సన్నిబాబు, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమా చంద్రమహేశ్వరి శ్రీను, బుద్ధ నరసింగరాజు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, యనమండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ

నేడు ఉపమాకలో కృష్ణాష్టమి

- వేణుగోపాలునికి పంచ హారతులు



నక్కపల్లి: ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న వేణుగోపాలస్వామి విగ్రహాన్ని నారద మహాముని ప్రతిష్ఠించారని స్థల పురాణం చెబుతోంది. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు, ఉపాలయాల్లో ఉత్సవమూర్తులకు నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తామని ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. యశోదాదేవి ఒడిలో కూర్చొని కృష్ణుడు పాలు తాగుతున్నట్లుగా అలంకరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు యశోద దేవికి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారికి వరుసగా ధూప హారతి, చంద్ర హారతి, గరుడ హారతి, నక్షత్ర హారతి, పీఠ హారతి, గజ హారతి కుంభ హారతులు సమర్పించడం జరుగుతుందన్నారు. శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారిని రాజాధిరాజ వాహనంలో ఊరేగించి, ఉట్ల పండగ నిర్వహిస్తామన్నారు.

రంగురాళ్ల తవ్వకాలు జరిపితే చర్యలు



తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జి.మాడుగుల: రంగురాళ్ల తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ అప్పలస్వామి, ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలో జోగులపుట్టు గ్రామ సమీపంలో కొండపై తవ్వకాలు జరిపిన ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించి వివరాలను సేకరించారు.

ఈజీ మనీకి ఆశపడి.. మోసపోయి

- రూ.2.76 లక్షలు పోగొట్టుకున్న బాధితురాలు
- అచ్యుతాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఆన్‌లైన్ మోసానికి మరొకరు నష్టపోయారు. సైబర్ నేరాలపై పోలీసులు, ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా.. అడ్డగోలుగా, తక్కువ వ్యవధిలో ఎక్కువ సంపాదించాలనే ఆశ గల వ్యక్తులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. ఇదే తరహాలో 'ఇంటి దగ్గర ఉండి సులభంగా డబ్బులు ఎలా సంపాదించాలి' అనే లింకు క్లిక్ చేసి, అచ్యుతాపురానికి చెందిన మహిళ రూ.2 లక్షల 76 వేలను పోగొట్టుకుంది. దీంతో పేరు బయట పెట్టేందుకు ఇష్టపడని సదరు బాధితురాలు అచ్యుతాపురం పోలీసులను బుధవారం ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాయిన్ స్విచ్ పేరిట ఏర్పాటైన సంస్థ ప్రజల్ని మోసం చేయాలనే ఉద్దేశ్యంతో వాట్సాప్ నంబర్లకు వివిధ రకాల యాడ్ లింకులు పంపిస్తోంది. ఇంటి దగ్గరే ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే ఈజీగా డబ్బులు సంపాదించుకోవచ్చని నమ్మబలికింది. తాము పంపే స్టార్ హోటల్స్, రెస్టారెంట్లకు రేటింగ్ ఇస్తే చాలని చెప్పింది. ఒక్కో రేటింగ్‌కు రూ.70 నుంచి రూ.210 వరకు కమీషన్ చెల్లిస్తామని నమ్మించింది. అనంతరం కొన్ని టాస్క్‌లు ఉంటాయని, వాటిని పూర్తి చేస్తే మరింత సంపాదించుకోవచ్చని ప్రలోభపెట్టింది. రూ.1000 చెల్లించి ఓ టాస్క్ ఎంపిక చేసిన వారికి బోనస్ రూ.200 కలిపి ఆరంభంలో రూ.1200 చెల్లించింది. అలా వారిలో నమ్మకాన్ని పెంచడంలో సంస్థ నిర్వాహకులు సఫలీకృతులయ్యారు. తర్వాత పెద్ద మొత్తంలో టాస్క్‌లకు చెల్లింపులు చేశాక, టాస్క్ పూర్తి చేయడంలో పొరపాటు చేయడం వల్ల డబ్బులు ఫ్రీజ్ అయినట్టు చెప్పేవారు. ఆ మొత్తం రిలీజ్ కావాలంటే అదనంగా టాస్క్‌లు తీసుకోవాలన్నారు. బాధితురాలు ఇలా అదనపు చెల్లింపులతో రూ.2.76 లక్షలను పోగొట్టుకుంది. ఆ మొత్తం రావాలంటే మరో రూ.4 లక్షలు చెల్లించాలని నిర్వాహకులు చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె ఎట్టకేలకు పోలీసులనాశ్రయించింది. అచ్యుతాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా

నర్సీపట్నం: పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరాంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు నర్సీపట్నం డివిజన్ ఈఈ రామకృష్ణ తెలిపారు. పరిశ్రమలపై విద్యుత్‌శాఖ విధించిన నిబంధనలను సడలించటం జరిగిందన్నారు. విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని పరిశ్రమలకు వారంలో ఒక రోజు హాలీడే ప్రకటించడంతోపాటు.. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే పరిశ్రమలను నడపాలని సూచించామన్నారు. వీటిన్నింటినీ సడలిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసిందని. పరిశ్రమల వారు నిరాంతరాయంగా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చునన్నారు.

ముగ్గురిని అరెస్ట్ చేసిన సీబీఐ

ఎంవీపీకాలనీ: లంచం డిమాండ్ ఘటనలో సీబీఐ ముగ్గురిని అరెస్టు చేసింది. ఈ మేరకు విశాఖలోని సీబీఐ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 5వ తేదీన జాయింట్ డైరెక్టర్ జనరల్ ఫారిన్ ట్రేడ్(జేడీజీఎఫ్‌టీ) బి.ఎస్.రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ పి.సీతారామరాజు, జేడీజీఎఫ్‌టీ సెక్షన్ హెడ్ శ్రీ భాష్యం వెంకట రంగనాథన్‌లను లంచం డిమాండ్, వసూలు కేసులో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపింది. కొత్త ఎగుమతి ధ్రువ పత్రాలు, కన్సల్టెంట్లు పునరుద్ధరణ, సంబంధిత లైసెన్సుల జారీ కోసం డీజీఎఫ్‌టీ పలు కన్సల్టెంట్ల నుంచి భారీ మొత్తంలో లంచాలు డిమాండ్ చేసినట్లు గుర్తించింది. ఇందులో భాగంగా పై వారిని అరెస్టు చేసినట్లు తెలిపింది.

వానా వానా వందనం

- జిల్లావ్యాప్తంగా వర్షపాతం
- అన్నదాతల్లో ఆనందం



గొలుగొండలో నీటితో నిండిన వరి పొలాలు

సాక్షి, అనకాపల్లి: ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించడంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ఆవర్తన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బుధవారం వేకువజామున ప్రారంభమైన వాన సాయంత్రం 7 గంటల వరకు ఏకధాటిగా కురిసింది. దీంతో వేసవికాలాన్ని తలపిస్తున్న వేడి వాతావరణం కనుమరుగైంది. వరినాట్లు వేసుకునే రైతులకు మేలు చేకూర్చినట్లయింది. ఎప్పుడెప్పుడా అని నేలచూపులు చూస్తున్న పంటలకు పునరుజ్జీవం పోసేలా కరువు తీరా వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. జిల్లాలో రికార్డు స్థాయిలో దేవరాపల్లిలో 8.7 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది.

రైతుల హర్షం

గత ఏడాది ఈ సమయానికి వరి పంట సగం పూర్తి కాగా ఈ ఏడాది రైతులు వరి నారు వేసి వర్షాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. నారు కళ్లముందే ఎండిపోతుంటే ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితితో ఉన్న రైతులు ఈ వర్షాలతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షపు నీరు పొలాల్లో చేరడంతో వ్యవసాయ పనులు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న తాచేరు

అనకాపల్లి జలమయం

వర్షాల కారణంగా అనకాపల్లిలో జనజీవనం స్తంభించింది. ఉద్యోగస్తులు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలో 13 మి.మీ. వర్షపాతం నమోదైంది. శ్రీరాంనగర్, ఏఎంసీ కాలనీ, జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ట్యాక్సీస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. అనకాపల్లి–చోడవరం ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు లక్ష్మీదేవిపేట రైల్వే క్రాసింగ్ మీదుగా భారీ వాహనాలను దారి మళ్లించారు. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న సబ్‌వే వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి.

జిల్లాలో వర్షపాతం (సెం.మీ.లలో)

దేవరాపల్లి	8.7
వడ్డాది	8.1
బుచ్చెయ్యపేట	6.9
నర్సీపట్నం	4.9
గొలుగొండ	4.5
యలమంచిలి (కొక్కిరాపల్లి)	4.1
చోడవరం	3.9
కశింకోట (నర్సింగబిల్లి)	3.7
పరవాడ	3.3
అనకాపల్లి టౌన్	2.5
కోటవురట్ల	2.1
మాకవరపాలెం	2.0

క్లుప్తంగా

29 నుంచి జాతీయస్థాయి డ్రాప్ రో బాల్ పోటీలు

అనకాపల్లిటౌన్: జాతీయ స్థాయి డ్రాప్ రోబాల్ క్రీడాపోటీలు ఈనెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘాజీయాబాద్‌లోని హైటెక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో జరుగుతాయని డ్రాప్ రోబాల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9441149808 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలు

- ప్రకృతి సేద్య విభాగం డీపీఎం లచ్చన్న


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సేద్య విభాగం డీపీఎం లచ్చన్న

రోలుగుంట: ప్రకృతి సేద్యంతో బహుళ ప్రయోజనాలున్నాయని ప్రకృతి సేద్య విభాగం డీపీఎం లచ్చన్న తెలిపారు. మండలంలోని శరబవరంలో బుధవారం ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో రైతులకు ప్రకృతి ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించినట్టు చెప్పారు. ప్రధానంగా ప్రకృతి సేద్యం వల్ల పంటల అభివృద్ధి మెరుగ్గా ఉంటుందన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

రోలుగుంట: మండలంలోని గైరంపేట-ఎం.కె.పట్నం రూట్‌లో ఎం.కె.పట్నం శివారున తరలించేందుకు సిద్ధం చేసిన 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ నాగకార్తీక్ తెలిపారు. రోలుగుంట మండలం ఎం.కె.పట్నం గ్రామానికి చెందిన శరమండ నూకరాజు, నర్సీపట్నం మండలం రావణాపల్లికి చెందిన మంజేటి ఈశ్వరరావు, ఇదే గ్రామానికి చెందిన ఎస్.రామోజీరావులను అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు. నిందితులను విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వుమెన్ స్టార్టప్ హబ్ @ ఐఐఎంవీ

- మహిళా పారిశ్రామికవేత్తలకు ఐఐఎంఐ ప్రోత్సాహం
- మహాత్మాగాంధీ ఫెలోషిప్ పొందిన 9వ ఐఐఎంగా రికార్డు
- 90కి పైగా మహిళల స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సౌకర్యం
- 14 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్స్ ఏర్పాటుకు ప్రణాళికలు


ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్


ఐఐఎంవీలో మహిళా పారిశ్రామికవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-విశాఖపట్నం(ఐఐఎంవీ) విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తోంది. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలో షిప్ పొందిన 9వ ఐఐఎంగా చరిత్ర పుటల్లోకెక్కిన ఐఐఎంవీ.. మహిళల కోసం ప్రత్యేకంగా వుమెన్ స్టార్టప్ హబ్‌ను ప్రారంభించింది. ఇప్పటికే 90 మందికిపైగా మహిళల స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సౌకర్యాన్ని కల్పించింది. మరోవైపు మూడు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 14 జిల్లాల్లో స్టార్టప్ హబ్‌లు ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది.

రెండేళ్ల సుదీర్ఘ ఫెలోషిప్‌తో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంలో భాగంగా అవసరమైన శిక్షణ, వనరులను సృష్టించే మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ (ఎంజీఎన్ఎఫ్)ని ఐఐఎంవీ దక్కించుకుంది. ఇందుకు ఎంపికైన 75 మంది యువత ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ఆయా కలెక్టర్ల వద్ద అండర్ స్టడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక స్టార్టప్ హబ్‌లను ఏర్పాటు చేయడంలో ఐఐఎంవీ విజయవంతంగా వ్యవహరిస్తోంది.

మహిళల కలలు సాకారం

ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ గ్రూప్-3 సెంటర్(జీ3సీ) ఇంక్యుబేటర్‌ను మంజూరు చేసింది. నిబంధనల ప్రకారం ఈ సెంటర్‌ను సెక్షన్-8 కంపెనీగా నిర్వహించాల్సిన నేపథ్యంలో ఐఐఎంవీ ఫౌండేషన్ ఫర్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూరియల్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఐఎంవీ ఫీల్డ్)ను ఏడాదిన్నర కిందట ప్రారంభించింది. ఈ సెంటర్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 90కిపైగా మహిళల నేతృత్వంలోని ఇక్కడ స్టార్టప్‌లు పురుడుపోసుకున్నాయి. తాజాగా 36 మంది మహిళా పారిశ్రామికవేత్తలతో మరో వుమెన్ స్టార్టప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు తమ కలలను సాకారం చేసుకునే దిశగా సహకారం తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ స్టార్టప్‌లలో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి.

డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌లకు శ్రీకారం

మరోవైపు.. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 14 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఐఐఎంవీ సన్నద్ధమవుతోంది. క్యాంపస్ అధికారులు ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపించగా.. వారి సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, సామర్థ్య నిర్మాణానికి కృషి చేయడంతో పాటు వన్ నేషన్ వన్ ప్రొడక్ట్ అనే అంశాన్ని ప్రోత్సహించేందుకు కూడా డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌లు ఉపయుక్తంగా నిలుస్తాయని క్యాంపస్ డైరెక్టర్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


మానిటరింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


సాగర్ సిమెంట్ పరిశ్రమ జీఎం కె. శ్రీనివాసరావును సత్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు, ఆస్తులకు మరింత రక్షణ ఏర్పడుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని బయ్యవరంలో సాగర్ సిమెంట్ పరిశ్రమ సహకారంతో రూ.5 లక్షల వ్యయంతో స్మార్ట్ ఫైబర్ నెట్ ఏర్పాటు చేసిన 33 సీసీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపడతాయని చెప్పారు. ఇప్పటికే కశింకోటలో సుమారు 150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌లో మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేసి అనుసంధానం చేశామన్నారు. ఇప్పుడు బయ్యవరంలో ఏర్పాటు చేశామని, ఇక్కడి సీసీ కెమెరాలను పర్యవేక్షించడానికి స్థానిక సచివాలయంలో మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేశారన్నారు. ఇందుకు ఆర్థిక సహకారం అందించిన ఫ్యాక్టరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ జీఎం కె. శ్రీనివాసరావును మంత్రి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధరరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ,సిమెంట్ ఫ్యాక్టరీ మేనేజర్ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

60 తులాల వెండి, తులం బంగారం చోరీ

అనకాపల్లిటౌన్: మండలంలోని కొత్తూరు గ్రామంలో వెండి, బంగారం చోరీ జరిగినట్టు బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ సింహాచలం కథనం మేరకు వివరాలు.. కొత్తూరు గ్రామానికి చెందిన వల్లూరు రమణ గత నెల 28న స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా సీతంపేట వెళ్లారు. మంగళవారం కొత్తూరులోని ఇంటికి వచ్చారు. ఇంటి బీరువాలో గల 60 తులాల వెండి, తులం బంగారం చోరీ జరిగినట్టు గమనించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

10న గవర్నర్ అరకు పర్యటన

సాక్షి,పాడేరు: రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఈనెల 10వ తేదీన అరకులోయలో పర్యటిస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 10.25 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ నుంచి బయలుదేరి 11గంటలకు అరకులోయలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11.30 గంటలకు రైల్వే అతిథి గృహానికి చేరుకొని అక్కడ నుంచి పద్మాపురం గార్డెన్‌కు వెళ్తారన్నారు. అక్కడి ట్రీకాస్టిల్‌తోపాటు గిరిజన మ్యూజియాన్ని గవర్నర్ సందర్శిస్తారని తెలిపారు. 12.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సుంకరమెట్ట కాఫీతోటలను పరిశీలిస్తారని పీవో పేర్కొన్నారు. అక్కడి నుంచి 1.15 గంటలకు బయలుదేరి అరకు ఏపీటీడీసీ అతిథి గృహానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి 1.50 గంటలకు విశాఖపట్నం తిరుగు ప్రయాణమవుతారని పీవో అభిషేక్ వెల్లడించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

మాకవరపాలెం: పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని మామిడిపాలెం శివారులో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారంతో బుధవారం రాత్రి సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసినట్టు చెప్పారు. వారివద్ద నుంచి రూ.15,040 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎంఎస్‌ఎంఈ పార్కులతో ఉపాధి కల్పన

- స్థానిక యువకులకే ఉద్యోగావకాశాలు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- రైతులకు రూ.28 కోట్ల పరిహారం అందజేత


రైతులకు భూ పరిహార చెక్కులు అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

ఆనందపురం: రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ పార్కులు) నెలకొల్పడానికి ఏర్పాట్లు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కణమాంలో ఏపీఐఐసీకి భూములు అందించిన వంద మంది రైతులకు బుధవారం రూ.28 కోట్ల పరిహార చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని యువకులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. గత టీడీపీ పాలనలో గ్రామాల్లో ఎన్నో సమస్యలు పరిష్కారం కాకుండా ఉండిపోయాయన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే వాటి పరిష్కారంపై దృష్టి సారించారని చెప్పారు. ఇటీవలే జగన్నాథపురంలో గ్రేహౌండ్స్ నిమిత్తం భూములు అందించిన రైతులకు రూ.15 కోట్లు చెల్లించామని తెలిపారు. కణమాంలో ఏపీఐఐసీ సేకరించిన 157 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటుతోపాటు, ఎంఎస్‌ఎంఈ పార్కు కూడా ఏర్పాటు చేయనున్నామని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తొందరలోనే ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీని వల్ల ఆనందపురం మండలంలో వందలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందని, ముఖ్యంగా ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన వారికి ఉపాధి మెరుగవుతుందన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేశారన్నారు. నాలుగున్నరేళ్లలో భీమిలి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రూ.3,700 కోట్లు వ్యయం చేయగా ఆనందపురం మండలంలో రూ.400 కోట్లు ఖర్చు పెట్టారని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్విరామంగా అమలు జరగాలంటే మరలా జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని, మరలా ఆయనకు ఆశీస్సులు అందించి మద్దతు తెలపాలని కోరారు. భీమిలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావుని మరలా మంచి మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ కణమాం గ్రామంలో గల భూములను గత టీడీపీ ప్రభుత్వం సేకరించినా రైతులకు పరిహారం అందించకుండా అన్యాయం చేసిందన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో రైతులకు న్యాయం జరిగిందన్నారు. టీడీపీ, ఇతర పార్టీల నాయకులు సెల్ఫీ ఛాలెంజ్‌లతో కాలక్షేపం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చూస్తున్నారని, ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని వదులుకుంటే అభివృద్ధిని మనమే నిరోధించుకున్న వారమవుతామన్నారు. కార్యక్రమంలో జేసీ విశ్వనాథన్, ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ఆబోతు అప్పలరాము, డీటీ రాజేష్, శొంఠ్యాం సహకార సంఘం అధ్యక్షుడు కాకర్లపూడి వరహాల రాజు, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, నాయకులు పినిశెట్టి సింహాచలం నాయుడు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, యర్ర అప్పలనాయుడు, పిన్నింటి వెంకట రమణ, లెంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల అపహరణ

గొలుగొండ: విశాఖపట్నంలో జరిగిన పెళ్లికి వెళ్లి బస్సులో తిరిగి వస్తున్న మహిళ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల గ్రామానికి చెందిన వెంకట సీతామహాలక్ష్మి మంగళవారం విశాఖపట్నంలో బంధువుల ఇంటిలో జరిగిన పెళ్లికి వెళ్లింది. బుధవారం విశాఖ నుంచి నర్సీపట్నం చేరుకుని అక్కడ నుంచి స్వగ్రామం అడ్డతీగల వెళ్లేందుకు బస్సు ఎక్కింది. బస్సు గొలుగొండ చేరుకునే సమయంలో బ్యాగులో బంగారం కనిపించలేదు. మెడలోని బంగారు ఆభరణాలను తీసి బ్యాగ్‌లో వేసి, ప్రయాణిస్తున్న సమయంలో చోరీకి గురయ్యాయని, గొలుగొండ పీహెచ్‌సీ మార్గంలో ముగ్గురు వ్యక్తులు బస్సు దిగి వెళ్లిపోయిన విషయం గమనించానని బాధితురాలు గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నెక్లెస్, ఉంగరాలు చోరీ అయినట్టు పేర్కొంది. ఎస్‌ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల కోర్టు బహిష్కరణ రేపు

విశాఖ లీగల్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాపూర్ కోర్టులో న్యాయవాదులపై పోలీసుల దాష్టీకాన్ని నిరసిస్తూ ఈ నెల 8న కోర్టులను బహిష్కరించనున్నట్టు విశాఖ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరప్రదేశ్ సంఘటనను నిరసిస్తూ కోర్టులను బహిష్కరించాలని కోరారు. ఈ నెల 4న పోలీసులు కోర్టులో న్యాయవాదులపై కిరాతకంగా లాఠీచార్జి చేసి హింసకు పాల్పడ్డారన్నారు. న్యాయవాదులకు సంఘీభావంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోర్టులను బహిష్కరించి నిరసన తెలుపుతామన్నారు.

పాపికొండల పర్యటనకు ఆర్థికశాఖ ఉన్నతాధికారి


పాపికొండల సందర్శనకు వెళ్తున్న ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్

దేవీపట్నం: రాష్ట్ర ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్ బుధవారం పాపికొండల పర్యటనకు వెళ్లారు. రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో ఐఏఎస్ అధికారులు అభిషిక్త కిశోర్, ప్రవీణ్ ఆదిత్యలతో ఆయన పోశమ్మగండికి చేరుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న గండిపోశమ్మ ఆలయ నిర్మాణ వివరాలను ఈవో జీవీ లక్ష్మీకుమార్ వివరించారు. అక్కడ నుంచి పర్యాటకశాఖ బోటుపై పేరంటపల్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీఆర్‌పురం మండలం పోచారం బోటింగ్ పాయింట్‌కు చేరుకున్నారు. రహదారి మార్గంలో భద్రాచలంలోని సీతారాములను దర్శించుకున్నారు. ఆయన వెంట రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం భన్సాల్ ఉన్నారు.

10 నుంచి కార్పొరేటర్ల అధ్యయన యాత్ర

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ కార్పొరేటర్లు ఈ నెల 10 నుంచి అధ్యయన యాత్ర చేపట్టనున్నారు. అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, తాగు, మురుగునీటి వ్యవస్థల నిర్వహణపై అధ్యయనం చేయనున్నారు. అమృత్‌సర్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం కానున్నారు. అలాగే పెహల్‌గం, దాల్‌లేక్ బోటింగ్, సోనామార్గ్, జోజిల్లా, జీరో పాయింట్, తాజ్ వాస్, కాత్రా, మాతా వైష్ణోదేవి టెంపుల్, గోల్డెన్ టెంపుల్, జలియన్ వాలా బాగ్, ఇండో-పాక్ వార్ బోర్డర్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తారు.

ఇదీ షెడ్యూల్..

ఈ నెల 10న ఇక్కడి నుంచి బయలుదేరి.. అదే రోజు సాయంత్రం 4 గంటలకు శ్రీనగర్ చేరుకుంటారు. 11న శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శిస్తారు. 12న శ్రీనగర్ నుంచి బయలుదేరి జోజిల్లా, జీరోపాయింట్, తాజ్‌వాస్ సందర్శించి అక్కడ అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. 13న రోడ్డు మార్గంలో కాత్రా చేరుకుంటారు. 14న కాత్రాలో మాతా వైష్ణోదేవి టెంపుల్, 15న అమృత్‌సర్‌లో గోల్డెన్ టెంపుల్, జలియన్‌వాలాబాగ్, ఇండో-పాక్ బోర్డర్‌ను సందర్శిస్తారు. 16న అమృత్‌సర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించిన అనంతరం ఢిల్లీ చేరుకుంటారు. అక్కడ వ్యక్తిగత పనులు చూసుకుని.. అనంతరం విశాఖ రానున్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణ భూ సేకరణకు జీవో జారీ

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


ల్యాండ్ అక్విజిషన్‌కు ప్రభుత్వం జారీ చేసిన జీవోను చూపుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: స్థానిక మెయిన్ రోడ్డు విస్తరణకు అవసరమైన భూమిని సేకరించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, ప్రజా అవసరాల దృష్ట్యా మెయిన్ రోడ్డును వంద అడుగులకు విస్తరించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే విస్తరణ పనులు మొదలు పెట్టినట్టు చెప్పారు. రోడ్డు విస్తరణకు 107 మంది భవన యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. వీరందరికీ టీడీఆర్ బాండ్లు జారీ చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింద ని చెప్పారు. టీడీఆర్ బాండ్లకు ముందుకు రాని 92 మంది భవన యజమానులకు సంబంధించి ల్యాండ్ అక్విజిషన్ చేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ల్యాండ్ అక్విషిషన్ ప్రక్రియ త్వరతగతిన పూర్తి చేసి మెయిన్ రోడ్డును వంద అడుగులకు విస్తరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ్ ఉత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబవుతున్న కేవీ - 2 పాఠశాల

కంచరపాలెం: కేంద్రీయ విద్యాలయం - 2 శ్రీవిజయనగర్‌లో ఏవీ సంఘటన్ ఎన్సీఈఆర్టీ - కేంద్ర విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ్ ఉత్సవాలు, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కళా ఉత్సవ్ 2023 - 24 ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ ప్రాంతీయ స్థాయికి చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 8 క్లస్టర్లు, 72 విద్యాలయాల్లోని సుమారు 400 మంది బాలబాలికలు నృత్యం, సంగీతం, డ్రామా, విజువల్ ఆర్ట్, టాయ్ మేకింగ్ వంటి వివిధ కళారూపాల్లో పోటీ పడనున్నట్టు తెలిపారు. ఐఎన్ఎస్ శాతవాహన కమాండ్ అధికారి, విద్యాలయ చైర్మన్ కమడోర్ రజత్, విద్యావేత్తలు పోటీలను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

బైక్‌లు దొంగిలించిన కేసులో ఇద్దరికి జైలు

మల్కాపురం: వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన కేసులో ఇద్దరికి రెండేళ్లు, మరొకరికి ఏడాది జైలు శిక్షతో పాటు ముగ్గురికీ రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.రాజేంద్రబాబు బుధవారం తీర్పు చెప్పారు. వివరాలివీ.. అనకాపల్లి ప్రాంతానికి చెందిన భీశెట్టి మహేష్ కుమార్, నరేష్ మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ఆరు బైక్‌లను దొంగలించారు. ఈ వాహనాలను బుచ్చయ్యపేట ప్రాంతానికి చెందిన నమ్మి రమణకు విక్రయించారు. తమ బైక్‌లు చోరీకి గురయ్యాయని వాహన యజమానులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. క్రైం ఎస్‌ఐ పల్లా దుర్గా భవానీశంకర్ దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధం ఉన్న ముగ్గురినీ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో మహేష్, నరేష్‌కు రెండేళ్ల జైలు, రమణకు ఏడాది జైలు శిక్ష విధించారు. ఏపీపీ పి.వాణి కేసును వాదించారు.

కారు ఢీకొని ఉక్కు అధికారికి గాయాలు


గాయపడిన ఈశ్వరప్రసాద్

ఉక్కునగరం: రోడ్డు ప్రమాదంలో స్టీల్‌ప్లాంట్ స్టాక్ వెరిఫికేషన్ విభాగం సీనియర్ మేనేజర్ కె.ఈశ్వర ప్రసాద్‌కు గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. విధుల్లో భాగంగా బుధవారం బైక్‌పై ప్లాంట్ లోపల ఉన్న సెంట్రల్ స్టోర్స్ విభాగానికి బయల్దేరారు. హిల్‌టాప్ కూడలి వద్ద కుడి వైపు మలుపు తిరుగుతుండగా అదే సమయంలో ఉక్కునగరం జంక్షన్ నుంచి మెయిన్ గేటుకు వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో కారు, బైకులు పక్కన ఉన్న కల్వర్ట్‌లోకి దూసుకుపోయాయి. ప్రమాదంలో ఈశ్వరప్రసాద్ కుడి చెయ్యి, పక్కటెముకలకు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతని ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గాంధీనగరంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం ఒకటో సచివాలయం పరిధి రామాలయం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, స్థానిక పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కృష్ణావతారంలో వేంకటేశుడు



కశింకోట: స్థానిక శివాలయం వద్ద వెలసిన ధ్యాన వేంకటేశ్వరస్వామి కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని అవతారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. చేత పిల్లనగ్రోవి పట్టుకున్న కృష్ణుని అవతారంలో అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

దొంగ గెడ్డపై వంతెన నిర్మాణం పూర్తి



దొంగ గెడ్డపై కొత్తగా నిర్మించిన వంతెన

అనకాపల్లిటౌన్: జిల్లాలో ఎంపీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీ బీవీ సత్యవతి బుధవారం సాక్షికి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధి, దేవీనగర్‌లో దొంగగెడ్డపై రూ.20 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిందన్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు దేవీనగర్‌లో రెండు బ్రిడ్జిలు తీవ్రంగా దెబ్బతిని కూలిపోయాయన్నారు. వాటి స్థానంలో నిర్మించిన బ్రిడ్జిని త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 348 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,260	4,690
రెండో రకం	4,200	4,250
మూడోరకం	3,900	4,100

అనకాపల్లి సినిమాలు

ద నన్	:రాజా
ఏం చేస్తున్నావ్	:సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్వలైజర్ 3	:సత్యనారాయణ స్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	:షిర్డిసాయి
జవాన్	:పర్తిసాయి
జవాన్	:వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:శ్రీసత్య
ఖుషి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 83 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-31 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 334 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 202 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వణికిస్తున్న విష జ్వరాలు

వర్షాకాలంలో విష జ్వరాలు భయపెడుతుంటాయి. వాతావరణంలో వచ్చే ఆకస్మిక మార్పులతో దగ్గు, జలుబు, జ్వరాలు వణికిస్తుంటాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ భయాలూ ఎక్కువే. పరిసరాల పరిశుభ్రత, కాస్త అప్రమత్తతతోపాటు, సత్వరం వైద్యుల్ని సంప్రదిస్తే ప్రమాదకర స్థాయి నుంచి బయటపడవచ్చని వైద్యులు, జీవీఎంసీ అధికారులు చెప్తున్నారు.

- డెంగ్యూ, మలేరియా భయంలో ప్రజలు
- పారిశుధ్య నిర్వహణపై జీవీఎంసీ దృష్టి
- ఇంటింటా తనిఖీలలో వైద్య సిబ్బంది





ఎన్టీఆర్ వైద్యాలయంలో ఓపీ వద్ద క్యూ కట్టిన రోగులు, (ఇన్‌సెట్) పేరుకుపోయిన చెత్త

తుమ్మపాల: పట్టణం, మండలంలో గత కొద్ది రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సాధారణ వైరల్ ఫీవర్‌కు భిన్నంగా దగ్గు, కాళ్లు, చేతులు, వంటి నొప్పులతో జ్వరం, జ్వరం తగ్గినా నొప్పులు తగ్గకపోవడంతో బాధితులు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో వాతావరణ మార్పులకు వచ్చిన జ్వరాల కన్నా, ఆగస్టులో జ్వరాల తీవ్రత విపరీతంగా పెరిగింది. కొన్ని చోట్ల టైఫాయిడ్, మలేరియా జ్వరాల తీవ్ర వ్యాప్తితో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ అస్పత్రితో పాటు పట్టణంలోని ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రుల వద్ద రోగులు క్యూ కడుతున్నారు.

అప్రమత్తతతో జ్వరాల నియంత్రణ

- జ్వరం, దగ్గు వంటి ఫ్లూ లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యంపైన, మందుల షాపులపైన ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలి.
- వీలైనంత విశ్రాంతి తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మాస్క్ ధరించాలి.
- యాంటిబయాటిక్ మందులు, దగ్గు సిరప్‌లు ఇష్టారాజ్యంగా వాడకుండా వైద్యులు సూచించిన మందులనే వినియోగించాలి.
- దుమ్ము, ధూళి, పొగ ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- ఆస్తమా, మధుమేహ వ్యాధిగ్రస్తులు జ్వరం, దగ్గు తీవ్రత పెరుగుతున్నట్లు అనిపించినా, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

డ్రైడే పాటిస్తే చాలా మేలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే సగం రోగాలను తప్పించుకోవచ్చు. ఇంటిలో నీటిని నిల్వ చేస్తున్న పాత్రలను ప్రతి శుక్రవారం క్లీన్ చేసి పూర్తిగా ఆరబెట్టాలి. ఫ్రిడ్జ్, కూలర్ వంటి పరికరాల్లో నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. ఇంటి పరిసరాల్లో వ్యర్థాల్లేకుండా చూసుకోవాలి. పూల కుండీలు, మట్టి పాత్రలు, ప్లాస్టిక్ పరికరాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లలో నీరు చేరి, దోమలు వ్యాప్తి చెందకుండా శుభ్రం చేసుకోవాలి. వీటిపై జీవీఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటికే వచ్చి మందులిచ్చారు

గత వారం రోజులుగా జ్వరం, దగ్గుతో నీరసం వచ్చేసింది. ప్రైవేట్ మందుల షాపు వారిచ్చిన మాత్రలు వాడినా తగ్గలేదు. ఇక లాభం లేదని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నాను. వైద్య పరీక్షలు చేసి, ఇంజక్షన్, మందులు ఇచ్చారు. రెండు రోజుల్లో నయం అయ్యింది. గ్రామంలో ఏఎన్‌ఎం నేరుగా ఇంటికే వచ్చి మరి కొన్ని మందులు అందించింది. ఇపుడు పూర్తిగా జ్వరం తగ్గింది.

– కరణం అప్పలనాయుడు, మార్టూరు గ్రామం

ముందస్తు చర్యలు



ఫ్యామిలీ డాక్టర్ పథకంలో నేరుగా గ్రామాలకే వెళ్లి మందులు అందిస్తున్నాము. కొన్ని గ్రామాల్లో సీజనల్ జ్వరాలు, వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నాయి. గ్రామాల్లో ఉన్న వైద్య సిబ్బంది ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాం. తెలుసుకున్న వెంటనే రోగుల ఇంటి వద్దకు వెళ్లి పరీక్షలు చేసి, మందులిస్తున్నాం. జ్వరాల వ్యాప్తి నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

–డాక్టర్ వాణి, పీహెచ్‌సీ వైద్యురాలు, తుమ్మపాల

డ్రైడేపై విస్తృత ప్రచారం

వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. వాటి నివారణకు అన్ని చోట్ల పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము. ఫ్రైడే డ్రై కార్యక్రమంతో ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. చిన్న పాటి జాగ్రత్తలు తీసుకుంటే రోగాల నుంచి తప్పించుకుని, ఆరోగ్యంగా జీవించవచ్చు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– చక్రవర్తి, జోనల్ కమిషనర్, జీవీఎంసీ

విశాఖ నగరానికి దీటుగా అనకాపల్లి అభివృద్ధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, దిలీప్‌కుమార్



అభివృద్ధి కార్యక్రమాల శిలఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి, ఎంపీ తదితరులు

- సంక్షేమ పథకాల అమలుతో ప్రజల్లో ఆర్థిక భరోసా
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

తుమ్మపాల: విశాఖ నగరానికి దీటుగా అనకాపల్లి పట్టణాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని అంజయ్య కాలనీలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పట్టణ సుందరీకరణలో భాగంగా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజల జీవితాలు బాగుపడ్డాయని, ప్రజల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పట్టణాలు, పల్లెల్లో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలన్నారు. సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు, వీలైనంత ఎక్కువ మందికి పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్లను అందిస్తూ, ఎవరైనా అర్హులు సంక్షేమ పథకాలు అందుకోని ఎడల, తక్షణమే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. తమ జీవనోపాధికి ప్రభుత్వ ఆర్థిక సాయం కావాలని కోరిన దివ్యాంగులకు భరోసానిచ్చారు.

అంతకు ముందు పట్టణంలో ఎంపీ బీవీ సత్యవతి, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జలగల మదుం జంక్షన్ నుంచి సుంకర మెట్ట జంక్షన్ వరకు బీటీ రోడ్డు అభివృద్ధికి రూ.3.42కోట్లు, సుంకర మెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి వరకు రూ.3.61 కోట్లతో తారురోడ్డు, సెంట్రల్ మెరీడియన్, ఫుట్‌పాత్ నిర్మాణ పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. నూకాంబికా అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభంపై ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పార్టీ స్థానిక నేతలు ఆకుల సంతోష్, ఎ.జయరాం, బండారు అప్పారావు, కొండూరు రవీంద్రనాథ్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన



నెహ్రూచౌక్‌లో కురుస్తున్న వర్షం

అనకాపల్లిటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా అనకాపల్లిలో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. జనజీవనం స్తంభించింది. ఉద్యోగులు, విద్యార్థులు, దైనందిన పనుల్లో బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. గవరపాలెం పరమేశ్వరి పార్కు, అరటి, కొబ్బరికాయల మార్కెట్‌లో వర్షపు నీరు నిలిచి, బురదమయంగా మారింది. వ్యాపార సముదాయాల నిర్వాహకులు, కొనుగోలుదార్లకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పట్టణంలో 13 మి.మీ. వర్షపాతం నమోదైంది. శ్రీరాంనగర్, ఏఎంసీ కాలనీ, జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ట్యాక్సీస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. అనకాపల్లి–చోడవరం ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో భారీ వాహనాల రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా మళ్లించారు. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న సబ్‌వే వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎస్‌ఐ జె.రమేష్, సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు. వచ్చే పోయే వాహనాలకు వేర్వేరుగా మార్గం చూపడంతో ట్రాఫిక్ సమస్య తొలగింది.

'బజాజ్' ప్రాంగణ నియామకాలు



ఇంటర్వ్యూ చేస్తున్న బజాజ్ కంపెనీ హెచ్‌ఆర్‌లు మహేష్, నాయుడు

అనకాపల్లిటౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో బజాజ్ మోటార్ కార్ప్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ తెలిపారు. కళాశాల ఆవరణలో బుధవారం 100 మంది నిరుద్యోగులకు ఉద్యోగ పరీక్షల అనంతరం, ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అనకాపల్లి, పరవాడ, సబ్బవరం, పాడేరు, మాకవరం, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, అరకు ప్రాంతాల్లో పనిచేసేందుకు త్వరలో నియామకపత్రాలను అందిస్తామన్నారు. బజాజ్ మోటార్ కార్ప్ హెచ్‌ఆర్‌లు బి.మహేష్, డి.నాయుడులు ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌ఐ మాధురి, అధ్యాపకులు కె.రాజేష్, ఎస్.ఆర్.జమీర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాడి రైతులకు గడ్డి కోత యంత్రాల అందజేత



కొత్తపల్లిలో గడ్డి కోత యంత్రాల పత్రాలతో రైతులు, పశువైద్యాధికారి ఆల్ఫాన్సా జార్జి

కశింకోట: పాడి రైతులకు గడ్డి కోత యంత్రాలు ఎంతో ప్రయోజనకరమని కశింకోట పశు వైద్యాధికారి ఆల్ఫాన్సా జార్జి అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో ఐదుగురు పాడి రైతులకు రాయితీపై మంజూరైన గడ్డి కోత యంత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డి కోత యంత్రాలను 40 శాతం రాయితీపై ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తోందన్నారు. ఈ యంత్రంతో గడ్డిని ముక్కలుగా కోసి మేతగా వేయడం ద్వారా పశువులు పూర్తిగా తింటాయని, పశుగ్రాస వృధాను అరికట్టవచ్చన్నారు. పాల దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. పశువులకు అంగుళం సైజులో ఎండు గడ్డిని కోసి మేతగా అందిస్తే పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. ఎన్నో ప్రయోజనాలున్న గడ్డి యంత్రాన్ని రాయితీపై రూ.20,382కు ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామ్, వైఎస్సార్ సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్ర సంఘీభావ ప్రదర్శన నేడు



మాట్లాడుతున్న లక్కవరపు రామారావు

అనకాపల్లిటౌన్: రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్రతో దేశంలో కాంగ్రెస్ పార్టీకి నూతన ఉత్సాహం వచ్చిందని ఏపీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కవరపు రామారావు అన్నారు. స్థానిక గాంధీనగరం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ జరిగిన రాహుల్ గాంధీ పాదయాత్ర దేశ ప్రజలను ఉత్తేజపరచిందన్నారు. జోడో యాత్ర ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గురువారం నెహ్రూచౌక్‌లో పాదయాత్ర సంఘీభావ ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ శ్రేణులంతా కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐ.ఆర్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



కశింకోటలో సన్మానం పొందిన ఉపాధ్యాయులతో వాసవీ క్లబ్ ప్రతినిధులు

కశింకోట: స్థానిక బాలికల పాఠశాలలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు కె.సి.గుప్తా జయంతి పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు, జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. క్లబ్ తరఫున ఉపాధ్యాయ, జర్నలిస్టుల దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలైన క్లబ్ రీజనల్ కార్యదర్శి కొరుప్రోలు వెంకటేశ్వరావు, స్థానిక బాలికల హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, కస్పూరుపాలెం హైస్కూల్ టీచర్ పి.శేషారత్నం, ఏఎస్ పేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నేమాల రమణారావు, విసన్నపేట పాఠశాల టీచర్ ఎస్.కృష్ణ ప్రసాద్‌లను దుశ్శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి సత్కరించారు. వీరితోపాటు స్థానిక పాత్రికేయులను కూడా సన్మానించారు. సమాజానికి వారందిస్తున్న సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నూకరాజు, జోన్ చైర్మన్ జి.సందీప్, క్లబ్ ప్రతినిధులు పీఎస్‌ఎంకే గుప్తా, పాలూరి భాస్కరరావు, పాలూరి బంగారుశెట్టి, పాలూరి రవీంద్ర, కె.రఘు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాల మెరుగుకు వినతి



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న సత్యనారాయణ, నారాయణరావు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యురాలు బీవీ సత్యవతిని బుధవారం ఎస్సీ, బీసీ వసతిగృహ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, పి.నారాయణరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ మేరకు పలు అభ్యర్థనలతో వినతిపత్రం అందించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిల సహకారంతో, ఎంపీ నిధుల ద్వారా వసతిగృహాలను అభివృద్ధి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



రాజయోగ కేంద్రంలో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులతో బ్రహ్మకుమారీలు



రాజయోగ కేంద్రంలో ప్రత్యేక అలంకరణలో కృష్ణుడు



కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం బ్రహ్మకుమారీల రాజయోగ కేంద్రంలో బుధవారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మూడేళ్ల నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కేంద్రం ప్రతినిధి బీకే శ్రీవిద్య మాట్లాడుతూ దేశంలో అనాదిగా వస్తున్న సాంప్రదాయంగా వేడుకల్ని నిర్వహించినట్లు తెలిపారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు ప్రమీల, పూర్ణిమ, సరళ, సభ్యులు నాయుడు, హరీష్ పాల్గొన్నారు.



తాళ్లపాలెం గాయత్రీ స్కూల్లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



ఉట్టి కొడుతున్న చిన్నారి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గాయత్రీ స్కూల్లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడు, గోపికల వేష ధారణలతో చిన్నారి విద్యార్థులు అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడ్డారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ

తుమ్మపాల: అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తానని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చినట్లు భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా నాయకులు గొర్లి తరుణ్ తెలిపారు.

పట్టణంలో బుధవారం మంత్రి అమర్‌నాథ్‌ను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రస్తావించాలని విన్నవించారు. ఈ మేరకు మంత్రి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు శాంక్షన్ ఆర్డర్‌తో త్వరలో శంకుస్థాపన చేస్తానని భరోసానిచ్చారు. మంత్రి హామీపై విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు నేడు

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామార్చన జరపనున్నట్లు పేర్కొన్నారు. వేద మంత్రాల నడుమ శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊయలలో లాలించి, సంప్రదాయంగా పలు రకాల వంటకాలు, పండ్లు వగైరా నివేదించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరపనున్నట్లు వెల్లడించారు.

- స్థానిక కోనేరు వద్ద వెలసిన శ్రీకృష్ణ ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని, మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు.
- స్థానిక సంతబయల రహదారి శ్రీకృష్ణ మందిరంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పూజలు, విష్ణు సహస్ర నామ పారాయణ, భజన, కోలాటం ప్రదర్శనలు ఉంటాయన్నారు. సాయంత్రం కృష్ణ వేష ధారులైన చిన్నారుల ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తామన్నారు. రాత్రి పిల్లలతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.